సాక్షి పెద్దపల్లి

మంగళవారం : 2 : ఏప్రిల్ : 2024



ముస్లింలకు ఇఫ్తార్

పెద్దపల్లిరూరల్: రంజాన్ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ(సా॥)	సహర్ బుధ(ఉ॥)
కరీంనగర్	6.28	4.39
పెద్దపల్లి	6.35	4.48
రాజన్న సిరిసిల్ల	6.35	4.48
జగిత్యాల	6.35	4.46

గరిష్టం/కనిష్టం
40.8/23.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామమ్ ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో సోమవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. ధాన్యంలో తాలు, తప్ప లేకుండా, నిర్దేశిత తేమ వచ్చాక కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని రైతులకు సూచించారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని ఆయన వెల్లడించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మానిటరింగ్ అధికారి సురేందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి హమీద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించిన ఎన్టీపీసీ

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం సాధించింది. మొత్తం 16,645 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని గత నెల 26న చేరుకుంది. ఈ విషయాన్ని ఎన్టీపీసీ అధికారులు సోమవారం వెల్లడించారు.

ఒకేషనల్ పరీక్షలకు 821మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో తరగతి ఒకేషనల్ పరీక్షలకు సోమవారం 821 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. 8మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాధికారి మాధవి వివరించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు



శ్రీనివాస్

గోదావరిఖని: సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని సీపీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న కొందరి ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెలాఖరు వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా డీజే సౌండ్ వినియోగంపై కూడా నిషేధాజ్ఞలుపొడిగించామని సీపీ పేర్కొన్నారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ట్రెయినర్లు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం టాస్క్ ఆధ్వర్యంలో 'ఎంప్లాయిబిలిటీ స్కిల్స్' అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను టాస్క్ రీజినల్ మేనేజర్ గంగా ప్రసాద్, కళాశాల చైర్మన్ ఎడవల్లి నవీన్ సోమవారం ప్రారంభించారు. మహేంద్రప్రైడ్ ట్రెయినర్ అమూల్య విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే ప్రతిభా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లుతో పాటు హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు భాగస్వామ్యం కల్పించాలి



సెమినార్‌లో ఇనుముల సతీశ్

మంథని: ఆంధ్రప్రదేశ్ వైజాగ్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఇటీవల జరిగిన దక్షిణ భారత ప్రాంతీయ సదస్సుకు ప ట్టణానికి చెందిన జాతీయ వికలాంగుల నెట్‌వర్క్ ప్రతినిధి ఇనుముల సతీశ్ హాజ రయ్యారు. ఆయన మాట్లాడుతూ, రాజ్యాధికారంలో దివ్యాంగులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. వా రి సంక్షేమానికి 15 వేల మంది సలహాలతో మేనిఫెస్టో తయారు చేశామని, రాజకీయ పార్టీలు అమలు చేయాలని సతీశ్ డిమాండ్ చేశారు.

లక్ష్యం చేరని ఆస్తిపన్ను

- మొండిబకాయిలు రూ.5కోట్లు
- ఎంతకీ వసూలు కాకపోవడంతో జాబితాలో డిమాండ్ తగ్గింపు
- రూ.14.75కోట్లకు వరకు నమోదైన వైనం
- తెరపైకి పన్ను సవరణకు రీ సర్వే చేయాలనే డిమాండ్



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను డిమాండ్‌ను అధికారులు భారీగా తగ్గించారు. సుమారు రూ.5కోట్ల పైచిలుకు మొండిబకాయిలు ఉండగా.. రూ.14.75కోట్ల వరకు డిమాండ్ రికార్డు చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నగరంలో ఆస్తిపన్ను డిమాండ్‌ను రూ.9.34కోట్ల వరకు చూపించారు. గత మార్చి 31వ తేదీ వరకు రూ.7.71కోట్ల వరకు ఆస్తిపన్ను వసూలు చేశారు. వసూళ్లు 83 శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే, మొండి బకాయిలే రూ.5కోట్లకు పైగా ఉండడతో వసూళ్ల శాతం తగ్గుతుందనే కారణంతో వీటిని జాబితాలో తగ్గించినట్లు సమాచారం.

రూ.5.11కోట్ల మొండి బకాయిలు..

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో రూ.14.75 కోట్ల వరకు ఆస్తిపన్ను డిమాండ్ ఉండగా, ఇందులో సుమారు రూ.5.11కోట్ల మేర మొండి బకాయిలు ఉన్నాయి. 12 మంది మొండి బకాయిదారులకు అధికారులు ఇటీవల లీగల్ నోటీసులు కూడా జారీచేశారు. అయినా, మొండి బకాయిలు వసూలు కాకపోవడంతో నిర్వహణ భారమై ఒకదశలో ఉద్యోగులకు వేతనాలు, వాహనాలకు డీజిల్ బిల్లులను సకాలంలో చెల్లించలేక అధికారులు చేతులెత్తేశారు. బకాయిదారుల అసెస్మెంట్లను డిమాండ్ నుంచి తొలగించాలని ఇటీవల పురపాలక శాఖ ఉన్నతాధికారులకు కూడా బల్దియా అధికారులు నివేదిక సమర్పించారు. దీంతో డిమాండ్ నుంచి సీడీఎంఏ మొండి బకాయిలను తొలగించింది.

ఇలా చేస్తే డిమాండ్ పెరిగే అవకాశం...

- ఇంటింటికీ పర్యటించి మరోసారి ఆస్తుల కొలతల సేకరణపై సర్వే నిర్వహిస్తే, భారీగా ఆస్తి పన్ను పెరిగే అవకాశాలు ఉన్నాయి.
- పట్టణ ప్రణాళికా విభాగం సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి కొత్తగా నిర్మించిన ఇళ్లను గుర్తించాలి.
- రేకుల షెడ్ల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. వాటిని గుర్తించి ప్రాపర్టీ ట్యాక్స్ అప్‌డేట్ చేయాలి.
- అనుమతి లేకుండా పైఅంతస్తులు, పెంట్ హౌస్‌లు నిర్మించుకుంటున్నారు. వాటిని గుర్తించి ట్యాక్స్ రివైజ్ చేయాలి. రోడ్డు వైపు నివాసాలను కమర్షియల్ కేటగిరీలోకి మార్చాలి.
- ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను అద్దెకు ఇవ్వాలి.
- మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో అద్దె ప్రాతిపదికన నడుస్తున్న బ్యాంకు, టెలిఫోన్ టవర్స్ తదితర వాటి పన్ను సవరించాలి.
- న్యూ అశోక్ టాకీస్ ఎదుట ఉన్న షాపులకు అద్దె వసూలు చేయాలి.
- మూడేళ్లకు ఒకసారి 33 1/3 శాతం అద్దె పెంచాలని నిబంధన ఉన్నప్పటికీ, గత 20 ఏళ్లుగా కూరగాయల మార్కెట్ అద్దెలు రివైజ్ చేయలేదు. వెంటనే ఆ పనిచేయాలి.

ప్రభుత్వానికి లేఖ రాశాం

రూ.5కోట్ల బకాయిలు కొన్నేళ్లుగా వసూలు కావడంలేదు. ఇందులో దాదాపు దశాబ్దానికిపైగా వసూలు కానివి కూడా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో నివాసాలు ఎక్కడా కనిపించడం లేదు. యజమానులు కూడా క్షేత్రస్థాయిలో కానరావడంలేదు. దీనిపై ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశాం. అయితే, ఈ మొండి బకాయిల వసూలుకు ఈ నెలలో ఆస్తులపై రీ సర్వే చేస్తాం. ఆస్తిపన్ను డిమాండ్ పెంచడం కోసం తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్, కమిషనర్, నగరపాలక సంస్థ, రామగుండం

48 గంటల్లోగా ధాన్యం డబ్బులు చెల్లింపు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

- 3 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- పెద్దపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈయాసంగి ధాన్యం దిగుబడి దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశముందని, ఇందుకోసం 305 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. వారంలోగా అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలిచ్చామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతీకేంద్రంలో ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం నిర్ధారించే యంత్రాలు ఉండాలని సూచించారు. గన్నీ సంచులు, లారీలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు 48గంటల్లోగా చెల్లింపులు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. మార్కెట్ కార్యదర్శి దేవరాజ్‌పృథ్వీరాజ్, అధికారులు శ్రీమాల, ప్రవీణ్‌రెడ్డి, ఆదిరెడ్డి, డీఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కోత'లు విధిస్తే కఠిన చర్యలు..

రైతులు తెచ్చిన ధాన్యంలో కోత విధించినట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కొనుగోళ్లు, రవాణాపై అవగాహన కల్పించారు. రైతుల వివరాలను తెలుసుకుని షెడ్యూల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలనే ఏర్పాటు చేయాలన్నారు. తూకం యంత్రాలను తనిఖీ చేయాలని అధికారి విశ్వేశ్వర్‌ను ఆదేశించారు. నాణ్యతాప్రమాణాలను పాటిస్తూ సజావుగ కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో అధికారులు శ్రీమాల, ఆదిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వసతిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. పంచాయతీ, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో తాగునీటి కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎండదెబ్బ తగిలితే పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీఈవో మాధవి, డీపీవో ఆశాలత, మిషన్‌భగీరథ ఈఈ పూర్ణచందర్, ఇంట్రా ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధికోసమే బీఆర్‌ఎస్ నీటి రాజకీయం

- కాంగ్రెస్ పాలనలోనే రైతులకు మేలు
- పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తాం
- సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం
- ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు అమలు చేస్తాం
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రిదుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల చేతిలో భంగపడ్డ బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మరోసారి తెలంగాణ ప్రజలు, రైతులను మోసగించి పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయలబ్ధి పొందేందుకే 'నీళ్ల' రాజకీయం చేస్తున్నారని రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు విజయరమణారావు, ఠాకూర్ మక్కాన్‌సింగ్‌తో కలిసి మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్లలో రైతులను ఏనాడూ పట్టించుకోని కేసీఆర్‌కు ఇప్పుడు వారి కష్టాలు గుర్తుకొచ్చాయని మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. అయినా రైతులు ఆయనను నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ పాలనలో చేసిన మోసాలు, పాపాలు బయటకు వస్తున్నాయని, వాటినుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తాం..

వ్యవసాయ రంగంలో సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తామని, అలాగే పాలకుర్తి మండలంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. తమ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీలన్నీ పక్కాగా అమలు చేస్తామని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటికే 35కోట్ల మంది అక్కాచెల్లెళ్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సాగించారని అన్నారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అర్హులందరికీ అందిస్తామని తెలిపారు. సాంకేతిక కారణాలతో పొరపాట్లు దొర్లినా ఇబ్బంది పడొద్దని, వారి నుంచి విద్యుత్ అధికారులు బిల్లులు వసూలు చేయరాదని సూచించారు. జిల్లా ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15కోట్ల విలువైన వైద్యసేవలు అందించామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసిన బీఆర్‌ఎస్ పాలకుల తప్పిదాలను గాడిన పెట్టేందుకే సమయం పడుతోందని తెలిపారు. సమావేశంలో నాయకులు శంకర్, రమేశ్‌గౌడ్, సారయ్య, ప్రకాశ్‌రావు, మహేందర్, సంపత్, మల్లయ్య, శ్రీనివాస్, మస్రత్, కుమార్, ఈర్ల స్వరూప, కుమారస్వామి, అక్బర్‌అలీ పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 11.19 టన్నుల యూరియా ఉత్పత్తి



ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 11.19 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేశామని ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ ఝా సోమవారం తెలిపారు. వార్షిక లక్ష్యం 12.5 లక్షల మెట్రిక్ టన్నులకు 11.19 లక్షల మెట్రిక్ టన్నులు సాధించామని ఆయన పేర్కొన్నారు. కర్మాగారంలో ఉత్పత్తిచేసిన యూరియాలో తెలంగాణకు 4,45,861.89 మెట్రిక్ టన్నులు అందించామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు 1,53,383.94 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 1,83,070.44 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 78,745.23 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 85,862.07 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 99,006.03 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 74,093.94 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని వివరించారు. ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులను అభినందించారు.

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

- మద్దతు ప్రకటించిన ఆరుగురు ఎంపీటీసీలు



సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి ఎంపీపీ వ్యాళ్ల అనసూర్యపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య సమక్షంలో ఎంపీడీవో శశికళ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 9మంది ఎంపీటీసీలు ఉండగా.. బందారి శ్రీవాణి(జీడీనగర్), ఎంఏ అతీఖ్(కన్నాల), వ్యాళ్ల అనసూర్య(ముంజంపల్లి) గైర్హాజరయ్యారు. పాత భాగ్యలక్ష్మి(బసంత్‌నగర్), దుర్గం కుమార్(పాలకుర్తి), ఎర్రం స్వామి(ఈసాలతక్కళ్లపల్లి), సంతపూరి ప్రియాంక(కొత్తపల్లి), గంగాధర రమేశ్(పుట్నూర్), సతీశ్(ఎల్కలపల్లి) సమావేశానికి హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. నిబంధనల ప్రకారం మూడింట రెండు వంతుల మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయడంతో ఆర్డీవో గంగయ్య.. అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు కొత్త ఎంపీపీని ఎన్నుకునేందుకు సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బసంత్‌నగర్ ఎస్సై స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సమావేశం అనంతరం పుట్నూర్ ఎంపీటీసీ గంగాధర రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నుకుని తోటి ఎంపీటీసీలు పూలమాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, నాయకులు మల్లెత్తుల శ్రీనివాస్, దేవనందుల రాజమౌళి, పాత రవీందర్, మాదాసు శ్రావణ్, భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు నోఎంట్రీ..

ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సమావేశానికి మీడియాను అనుమతించలేదు. సమావేశ నిర్వహణపై కూడా మీడియా ప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. సమావేశం అనంతరం పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య వివరాలను వెల్లడించారు. కాగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మీడియాను అనుమతించలేదని అధికారులు తెలిపారు.

సమష్టి కృషితో లక్ష్య సాధన

- ఏరియాలో 103శాతం బొగ్గు ఉత్పత్తి
- ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్



చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సమష్టి కృషితో ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించినట్లు ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఏరియా వార్షిక బొగ్గు ఉత్పత్తి వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 43.80లక్షల టన్నుల లక్ష్యానికి 44. 95లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాన్ని మించి 103శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే మార్చిలో 4.01 లక్షల టన్నుల లక్ష్యానికి 6.01లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 150శాతం నమోదు చేసినట్లు వివరించారు. ఏరియాలో 1,680 మంది ఉద్యోగులు మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కాగా 1,469మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు అందించామని పేర్కొన్నారు. 131మందికి రూ.25 లక్షల చొప్పున సొమ్ము అందజేశామన్నారు. 14 మందికి ఎంఎంసీ ద్వారా నెలకు రూ.26 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. సీపీఆర్‌ఎంఎస్ స్కీం ద్వారా 5,624మందికి మెడికల్ కార్డులు అందజేశామని పేర్కొన్నారు. వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో అహర్నిశలు శ్రమించిన ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

నవోదయ ఫలితాలు విడుదల

- 5లోగా అడ్మిషన్ దరఖాస్తు తీసుకోవాలి

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను ప్రిన్సిపాల్ మంగతాయారు విడుదల చేశారు. ప్రొవిజనల్ సెలెక్ట్ లిస్టు ద్వారా అర్హులైన 80 మంది విద్యార్థుల రూల్ నంబర్‌లను ప్రకటించారు. ఫలితాలు నవోదయ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని, ఎంపికైన విద్యార్థులు ఆధార్ కార్డు, హాల్‌టికెట్, దరఖాస్తు సమయంలో హెచ్‌ఎం సంతకంతో అప్‌లోడ్ చేసిన ఒరిజినల్ పత్రం తీసుకొని ఈ నెల 5లోగా విద్యాలయం నుంచి అడ్మిషన్ ఫాం పొందాలని సూచించారు.

తొమ్మిదో తరగతి ఫలితాలు

విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గత ఫిబ్రవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను కూడా ప్రిన్సిపాల్ విడుదల చేశారు. 319617, 320343, 319357, 320209, 320043 హాల్ టికెట్ నంబర్లు గల ఐదుగురు విద్యార్థులు తొమ్మిదో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారని తెలపారు. ఈ నెల 5లోగా హాల్‌టికెట్లు, ఆధార్ కార్డుతో హాజరై విద్యాలయంలో అడ్మిషన్ దరఖాస్తు తీసుకోవాలని సూచించారు.

సమస్యలు ఉంటే.. ఇలా ఫిర్యాదు చేయండి



పెద్దపల్లిరూరల్: నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. అయితే, వాటిపై జిల్లావాసుల్లో చాలా మందికి అవగాహన లేదు. దీంతో సమస్యలు, ఇబ్బందులు ఎదురైనప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ల సేవలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఎక్కువగా చోటు చేసుకుంటున్న సైబర్ మోసాల నుంచి సత్వరమే బయట పడేందుకు టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచారు. వేధింపులు, హింసలు, ఇతరత్రా అనేక సమస్యలకు సంబంధించి అందుబాటులో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్లపై ప్రజలు అవగాహన పెంచుకుని ఆయా సేవలను సద్వినియోగం చేసుకుంటే కొంతైనా మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఆ వివరాలు ఇవీ..

- **సైబర్ నేరాల కట్టడి : 1930**

ప్రస్తుతంలో సమాజంలో సైబర్ నేరాల బారినపడే వారిసంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నిరక్షరాస్యులే కాకుండా విద్యావంతులు సైతం సైబర్‌నేరాల బారినపడి మోసాలకు గురవుతున్నారు. అయితే, బ్యాంకుకు వెళ్లకుండా సత్వరమే బ్యాంకు ఖాతా లావాదేవీలను కట్టడి చేసేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయొచ్చు.

- **మానసిక సమస్యలు : 14416**

మీరు మానసిక ఇబ్బందులతో బాధపడుతున్నారా? ఒత్తిడికి గురై ఇబ్బంది పడేవారు, లేదా వారి కుటుంబీకులు, మిత్రులు 14416 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారమివ్వండి.. మీ సమస్యను అర్థం చేసుకుని దానినుంచి బయట పడేలా సహకరిస్తారు పలువురు నిపుణులు.

నిరాదరణకు గురయ్యే వృద్ధులు : 14567

వయోభారంతో బాధపడుతున్న వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారా? కన్న బిడ్డలు తల్లిదండ్రులను ఆదరించకపోయినా ఆ సమాచారాన్ని ఎవరైనా టోల్‌ఫ్రీ నంబరు 14567కు అందిస్తే చాలు.. ప్రభుత్వాధికారులు స్పందించి కుటుంబీకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తారు. ఇంకా అవసరమైతే డివిజనల్ స్థాయి మెజిస్ట్రేట్ విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తారు.

- **వేధింపులకు గురయ్యే మహిళలు : 181**

రోడ్డుపై వెళ్తుండగా ఆకతాయిలు వేధించినా, నిత్యం భర్త చేతిలో హింసకు గురైనా.. ఇలా వేధింపులకు గురయ్యే మహిళలు టోల్‌ఫ్రీ నంబరు 181కు కాల్ చేస్తే చాలు నిమిషాల్లోనే 'సఖి' కేంద్రానికి చెందిన వాహనం తరలివస్తుంది. బాధితులకు అవసరమైన అన్ని సేవలు అందిస్తుంది. అవసరమైతే ఉచితంగా వసతి, పోలీసుల సేవలు, వైద్యం, న్యాయం అందించేలా సాయమందిస్తారు.

విద్యుత్ సమస్యలు : 1912

కరెంట్ బిల్లులు, మీటరు కనెక్షన్ మంజూరు చేయడంలో జాప్యం.. ఇలా విద్యుత్‌పరమైన ఇబ్బందులు, సమస్యలు ఉంటే నేరుగా టోల్‌ఫ్రీ నంబరు 1912 లేదా 18004250028కు కాల్ చేస్తే చాలు.. అక్కడున్న అధికారులు సమస్యకు పరిష్కారమార్గం చూపుతారు.

- **బాలల సంరక్షణ : 1098**

బడీడు పిల్లలు బాలకార్మికులుగా పనిచేస్తున్నా.. మైనర్లకు వివాహం చేస్తున్నా మీ దృష్టికి వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1098కు సమాచారమివ్వొచ్చు. సమాచారం అందగానే సంబంధిత ఐసీడీఎస్, చైల్డ్‌వెల్ఫేర్, కార్మికశాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుని న్యాయం చేస్తారు.

గ్యాస్ లీక్ : 1906

ఇంట్లో వంటకు వినియోగించే గ్యాస్ సిలిండర్ లీకవుతున్నట్లు గుర్తిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1906కు సమాచారం అందిస్తే పరిష్కారం చూపుతారు. ఏ కంపెనీ సిలిండర్ అయినా ఇదే టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

క్లుప్తంగా

సింగరేణి సీఎండీకి సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించిన సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాంను సోమవారం అధికారుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సీఅండ్‌ఎండీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈఆర్థిక సంవత్సరం 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు 70మిలియన్ సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు టి.లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదరిశ పి.నర్సింహులు, నాయకులు పొనుగోటి శ్రీనివాస్, కిరణ్‌రాజ్‌కుమార్, పి.మోహనరావు, విష్ణు, మదార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అధికారులకు సంబంధించిన సమస్యలు సీఅండ్‌ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ల్యాప్‌టాప్‌లు ఇవ్వటంతో పాటు. ఐఐటీ/ఐఐఎం ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలన్నారు.

మంత్రికి సన్మానం

రామగిరి(మంథని): జాతీయ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబను ఆర్జీ–3 ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి సన్మానం చేశారు. నాయకులు మద్రి ఓదేలు, పెద్ది సమ్మయ్య, పర్శవేన మోహన్, వంశీకృష్ణ, స్వామ్య నాయక్, రాము, శ్రీకాంత్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆవుల పట్టివేత

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని వధశాలకు ఆవులను తరలిస్తుండగా వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ తదితర సంఘాల నాయకులు వ్యాను పట్టుకుని పోలీసులకు సమాచారమందించారు. గోవులను వధశాలకు తరలించకుండా నాయకులు వెంకటరమణ, వేల్పుల రమేశ్, సాయి, సంపత్ తదితరులు అడ్డుకుని వాటిని గోశాలకు తరలించినట్లు తెలిపారు.

సింగరేణి ప్రహరీ నిర్మాణం



ప్రహరీ నిర్మిస్తున్న సిబ్బంది

గోదావరిఖని: బస్టాండ్ కాలనీలోని సింగరేణి క్వార్టర్లకు ఆనుకుని ఉన్న స్థలంలో ఇల్లు నిర్మించి ప్రహరీ అక్రమంగా కూల్చివేశారని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ తెలిపారు. సరెండర్ ల్యాండ్‌లో ఇల్లు నిర్మించి, కమర్షియల్ భవనంగా మార్చారని పేర్కొన్నారు. సింగరేణి కాంపౌండ్‌ను అక్రమంగా కూల్చి ఫుట్‌పాత్ ఆక్రమించి మెట్లు నిర్మించారని, అయితే, సింగరేణి యాజమాన్యం స్పందించి అక్కడే మళ్లీ గోడ నిర్మించినట్లు జీఎం వివరించారు. గోడను కూల్చివేసిన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అక్రమంగా కంపెనీ ఆస్తులను ధ్వంసం చేసినా, కంపెనీ స్థలాలను ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జీఎం హెచ్చరించారు.

ఫారిన్ పోదాం.. చదువుకుందాం

కరీంనగర్:



- విద్యానిధి ద్వారా విదేశాల్లో చదువులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఉన్నత చదువులకు చక్కటి అవకాశం
- పది దేశాల్లో చదివేందుకు ప్రాధాన్యం

డిగ్రీచేసి విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు ఆసక్తి ఉన్నవారికి విదేశీ విద్యా నిధి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఒక్కోవిద్యార్థికి రూ.20లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తోంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఉపకార వేతనం, బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాపులే విద్యానిధి పథకాలు భరోసానిస్తున్నాయి. 2014–15 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ, ఎస్టీలకు, 2018 నుంచి బీసీలకు ఈ పథకాలను అమలు చేస్తున్నారు.

చేయూతనిస్తున్నా అంతంతే..

విదేశీ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ కొందరే సద్వినియోగం చేసుకుంటున్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ప్రారంభమై తొమ్మిదేళ్లయినా ఇప్పటివరకు విదేశాలకు వెళ్లింది 26 మందే. ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం ద్వారా ఇప్పటి వరకు 51మంది విదేశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు. మహాత్మా జ్యోతిబాపులే విద్యానిధి పథకం ద్వారా జిల్లా నుంచి 18 మంది ఎంపికైనట్లు సమాచారం.

అవగాహన డొల్ల..

జిల్లా నుంచి ఏటా వందలాది మంది డిగ్రీ పట్టాలు పొందుతున్నారు. చాలా మందికి విదేశాల్లో చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వం విద్యానిధి పథకాలతో విదేశీ విద్యను ప్రోత్సహిస్తున్నా క్షేత్రస్థాయిలో అందరికీ దక్కడం లేదు. జిల్లాలో 130కి పైగా ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల యాజమాన్యం విదేశీవిద్యపై అవగాహన కల్పిస్తే చాలా మంది సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది.

జిల్లా నుంచి ఇతర దేశాలకు వెళ్లిన వారి సంఖ్య

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం (ఎస్సీ,ఎస్టీ)	26
ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం(మైనార్టీ)	51
మహాత్మాజ్యోతిబాపులే (బీసీ)	18

ఇవీ.. అర్హతలు

ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్ర కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసి, 60 శాతానికి పైగా మార్కులు సాధించాలి. టోఫెల్‌లో 60శాతం, ఐఈఎల్ టీఎస్ 80మార్కులు, జీఆర్‌ఈ టోఫెల్, జీమ్యాట్‌లో ఉత్తీర్ణత సాధించి పీఈటీలో 50శాతం అర్హత మార్కులు ఉన్నవారికి అవకాశం ఉంటుంది. విద్యార్థి వయసు 35 ఏళ్ల లోపు, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి.

పదిదేశాల్లో అమలు

గతంలో నాలుగు దేశాల్లోని యూనివర్సిటీల్లో మాత్రమే విద్యార్థులు చదువుకుంటే రుణసౌకర్యం కల్పించేవారు. ఈసారి ఆ సంఖ్యను పది దేశాలకు పెంచారు. దక్షిణ కొరియా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, న్యూజిలాండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ దేశాల్లో విద్యను అభ్యసించాల్సి ఉంటుంది. ఇక్కడ వైద్యవిద్య, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్‌సైన్స్, వ్యవసాయం, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్, తదితర కోర్సుల్లో పీజీ చేయడానికి అవకాశముంది.

ఈ సర్టిఫికెట్లు అవసరం

కులం, ఆదాయం, జనన ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డు, పదో తరగతి, డిగ్రీ, ఇంటర్, పీజీ మార్కుల జాబితాలతోపాటు టోఫెల్, ఐఈఎల్, టీఎస్‌జీఆర్‌ఈ, జీమ్యాట్, పీఈటీ అర్హత కలిగి ఉండాలి. విదేశాల్లో విద్యాభ్యాసం చేయడానికి సంబంధిత కళాశాల ప్రవేశ అనుమతిపత్రం, ప్రవేశ రుసుం చెల్లించిన రశీదు. బ్యాంకుఖాతా పుస్తకాలు. వీటి ఆధారంగా మీసేవాకేంద్రంలో గానీ, ఆన్‌లైన్‌లో కానీ తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలి. సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.10 విలువైన నాన్ జ్యూడిషియల్ స్టాంపును అతికించి రిజిస్ట్రార్ సంతకంతో కూడిన పత్రాన్ని ఆదాయ ధ్రువపత్రానికి జత చేసి దరఖాస్తు సమర్పించాలి. ఆయా సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలోని కమిటీ సభ్యులు దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. ఎస్సీ సంక్షేమశాఖ నుంచి విద్యానిధి దరఖాస్తులకు మార్చి31వరకు గడువు ముగిసింది. బీసీ సంక్షేమశాఖ నుంచి ఏప్రిల్ 5 వరకు అవకాశం కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి



విదేశాల్లో చదువుకోవాలని ఆసక్తి ఉన్న ప్రతీఒక్కరికి మహాత్మాజ్యోతిబాపూలే విద్యానిధి పథకం ద్వారా ప్రభుత్వం రూ.20 లక్షల రుణ సహాయం అందించి చేయూతనందిస్తోంది. ఉన్నత విద్యాభ్యాసం కోసం జిల్లా నుంచి ఇప్పటి వరకు 18 మంది విదేశాలకు వెళ్లారు. ఈ అవకాశం ఏడాదికి నాలుగుసార్లు ఉంటుంది. డిగ్రీ పూర్తి చేసినవారు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.అనిల్ ప్రకాశ్, బీసీ సంక్షేమశాఖ అధికారి

ఉన్నత విద్యకు ఓ వరం



అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దళిత విద్యార్థులకు ఓ వరం లాంటిది. ఏటా పది లక్షల చొప్పున రెండేళ్లు రూ.20 లక్షల రుణసాయం ఉన్నత విద్యకు అందజేస్తున్నాం. పది విదేశాల్లో చదువుకునేందుకు ఈ పథకం దోహదపడుతుంది. పథకం తీరు తెన్నులపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో ఆశించిన మేరకు దరఖాస్తులు రావడం లేదు.

– నేతానియల్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

51 మందికి అవకాశం

మైనార్టీ సంక్షేమశాఖ నుంచి ఉన్నత విద్యను విదేశాల్లో అభ్యసించేందుకు 2015–16లో ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు 51మంది విద్యార్థులు ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లారు. ప్రస్తుతం దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉంది. మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.పవన్‌కుమార్, డీఎండబ్ల్యూవో

ఆలయాల్లోనూ అవినీతి

- దేవుని భూములు కబ్జా చేశారు
- గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరిపిస్తాం
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మనవడితో కలిసి రాజన్నకు మొక్కు చెల్లింపు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న మంత్రి సురేఖ, చిత్రంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: గత ప్రభుత్వ పాలనలో ఆలయాల్లో అవినీతి, అక్రమాలు మితిమీరాయని, దేవుని భూములు కబ్జాకు గురయ్యాయని, వీటిపై కమిటీలు వేసి విచారణ జరిపిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. తన మనవడి పుట్టువెంట్రుకలు సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్న మంత్రి.. స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పకడ్బందీ విచారణ జరిపిస్తామన్నారు. కోడెమొక్కులకు నిలయమైన వేములవాడ రాజన్న రాజన్నగుడి, పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. దేవాలయాల భూములపై సర్వేలు చేయించి హద్దులు గుర్తిస్తామని, యాజమాన్యాలకు పాస్‌బుక్‌లు ఇప్పిస్తామని అన్నారు. దేశ, విదేశాల నుంచి రాష్ట్రంలోని ఆలయాలకు కానుకలు వచ్చేలా త్వరలోనే వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రజలు, భక్తుల నుంచి నిధులు సమకూర్చి ఆలయాలను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొనఆనరు. దాతల సహకారంతో కాకతీయుల కాలం నాటి మాదిరిగానే ఆలయాలకు పూర్వవైభదవం తీసుకొస్తామన్నారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలన పాపాల పుట్ట

- ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేశారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి సోమవారం పెద్దపల్లిలో మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పడుతున్న ఇబ్బందులకు అప్పటి సీఎం కేసీఆర్ అనుసరించిన విధానాలే కారణమని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్ సరికాదని ఆనాడే చెప్పామని అన్నారు. అయినా ప్రాజెక్టు పూర్తయ్యాక రైతుల భూములు సేకరించి వ్యవసాయ రంగానికి చుక్కనీరు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే కుట్రతో బయల్దేరిన కేసీఆర్ మాటలను ఎవరూ నమ్మరని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇపుడు ఏదో వంకతో రోడ్డెక్కి మొసలికన్నీరు కారిస్తే రైతులు, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రైతుల రుణమాఫీ చేస్తామని నమ్మించి.. వారిని బ్యాంకులో డిఫాల్టర్లుగా మార్చి రుణం దొరక్కుండా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుబంధు అనర్హులకు అందించాలన్న దురుద్దేశంతోనే రాయితీ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందకుండా చేశారని ఆరోపించారు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్‌లో వానలు కురవాలని, గతేడాది బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో వానలు కురిశాయా? అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలతో వానలు కురవలేదని, ఈ కారణంగా రిజర్వాయర్లు నీళ్లతో నిండలేదని తెలిపారు. యాసంగి పంటలను కాపాడేందుకు తమ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోందని వెల్లడించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సేవలతోనే మంచిగుర్తింపు



హెడ్‌కానిస్టేబుల్ దంపతులను సన్మానిస్తున్న ఏసీపీ

పాలకుర్తి(రామగుండం): ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని, అయితే ఉద్యోగిగా పనిచేసిన కాలంలో చేసిన సేవలతోనే మంచి గుర్తింపు లభిస్తుందని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఆదివారం పదవీ విరమణ పొందిన అజీజ్‌బేగ్ సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ కృష్ణ మాట్లాడుతూ, కత్తిమీద సాములాంటి పోలీస్‌శాఖలో 34ఏళ్ల పాటు సేవలు అందించిన అజీజ్‌బేగ్ అభినందనీయుడన్నారు. ఈసందర్భంగా అజీజ్‌బేగ్ దంపతులను పూలమాల, శాలువాతో సన్మానించారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో పెద్దపల్లి సీఐ కృష్ణ, బసంత్‌నగర్ ఎస్సై శివాణిరెడ్డి, సిబ్బంది రవీందర్‌గౌడ్, శివకుమార్, సురేశ్, రవీందర్, అనిల్, కొమురయ్య, శ్రీనివాస్, చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు



గాయపడిన పబ్బ రాజయ్యగౌడ్

ఓదెల(పెద్దపల్లి): పెద్దకొమిర గ్రామానికి చెందిన రైతు పబ్బ రాజయ్యగౌడ్ విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. రెండురోజుల క్రితం పంట పొలంలో పనుల కోసం వెళ్లిన రాజయ్యపై అకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ ప్రమాదంలో చేతులు, తలకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన రైతులు వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

లక్ష్య సాధనలో ఆర్జీ–2 పనితీరు భేష్

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఏరియా ఉద్యోగుల పనితీరు అభినందనీయమని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. సోమవారం వార్షిక ఉత్పత్తి లక్ష్యాల వివరాలు విడుదల చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 96.50లక్షల టన్నులకు లక్ష్యానికి 98.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 102శాతం నమోదు చేశామని పేర్కొన్నారు. 92.07లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు వెల్లడించారు. ఉపరితల గనులకు ధీటుగా వకీల్‌పల్లి భూగర్భగని 100శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి లభాల బాటలో నిలిచిందని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి సంస్థ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఉద్యోగులు, అధికారులకు సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడి



సారాబట్టీ ధ్వంసం చేస్తున్న పోలీసులు

రామగిరి(మంథని): బేగంపేట గ్రామ శివారులోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆబ్కారీ పోలీసులు సోమవారం దాడులు చేశారు. నాటుసారీ తయారీ బట్టీలు ధ్వంసం చేశారు. 800 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఆబ్కారీ స్పెషల్ స్క్వాడ్ సీఐలు మోసీన్ అలీ, నరేందర్‌రెడ్డి, మంథని సీఐ రాకేశ్‌కుమార్, ఎస్సైలు సాయికుమార్, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్, రామగుండం, మంథని ఆబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుకున్న గంజాయి మాయం?

జగిత్యాలక్రైం/సారంగాపూర్: పోలీసులు పట్టుకుని సీజ్ చేసిన సుమారు 70 కిలోల గంజాయి మాయమైన ఘటన సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023 ఫిబ్రవరి ఒకటిన వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఓ అంబులెన్స్ అనుమానాస్పందంగా కనిపించింది. దానిని తనిఖీచేయగా 70 కిలోల గంజాయి లభ్యమైంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో భద్రపరిచి సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై క్వార్టర్స్ పక్కన పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం పోలీసులు సదరు అంబులెన్స్‌ను గమనించగా.. గంజాయి కనిపించలేదు. దీంతో అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి పరిశీలించిన పోలీసులు గంజాయి చోరీ అయినట్లు నిర్ధారించుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు భారీ ఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. డాగ్‌స్క్వాడ్ బృందాలను రప్పించి అణువణువునా తనిఖీలు చేశారు.

సీసీ పుటేజీల పరిశీలన

సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి మా యంపై జిల్లా పోలీసులు సత్వరమే స్పందించారు. భారీ ఎత్తున పోలీసు బలగాలు రంగంలోకి దిగి సారంగాపూర్‌తోపాటు సమీప గ్రామాల్లోని సీసీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయిని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్వార్టర్స్ పక్కనే పార్కింగ్ చేసిన అంబులెన్స్ నుంచి మాయమవడం చర్చనీయాంశంగా మారింది. గంజాయి మాయంపై ఎ స్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను 'సాక్షి' సంప్రదించగా.. పూ ర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృపాబాయి

రామగుండం: ఆరోగ్యమే మహాభాగ్యమని, నేటి బాలలే రేపటి పౌరులని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి కృపాబాయి అన్నారు. ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ని ర్వాహకుడు మద్దెల దినేష్ ఆధ్వర్యంలో స్థానిక తబితా ఆశ్రమంలోని 45 మంది చిన్నారులకు సోమవారం వైద్యపరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ పై అవగాహన కల్పించారు. రామగుండం నగ ర పాల క కమిషనర్ శ్రీకాంత్, మేయర్ బంగి అనిల్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ పారిజాతం, సైకాలజిస్టు సాధ్వి మైథిలి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యపారిశ్రామిక సంఘం చైర్మన్‌కు సన్మానం



నర్సయ్యను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లిరూరల్: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కొలిపాక నర్సయ్యను రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం జిల్లా కేంద్రంలో సత్కరించారు. మత్స్యకార్మికులకు అండగా ఉంటూ ప్రభుత్వ పథకాలను అందించేలా సహకరించాలని జిల్లా అధ్యక్షుడికి సూచించారు. మత్స్యకార్మికుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని మంత్రి అన్నారు. నాయకులు కొలిపాక శ్రీనివాస్, గంగుల సంతోష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభిలాశ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



అభిలాశ్ తండ్రితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

తిమ్మాపూర్: గతనెల హాస్టల్‌లో అదృశ్యమై 27 రోజుల తర్వాత బావిలో శవమై తేలిన మంథని నియోజకవర్గం కాటారానికి చెందిన డిప్లొమా విద్యార్థి అభిలాష్ కుటుంబసభ్యులను ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం పరామర్శించారు. హైదరాబాద్ వెళ్తున్న ఆయన.. తిమ్మాపూర్ రాజీవ్ రహదారిపై కాసేపు ఆగి అభిలాష్ కుటుంబసభ్యులతో మాట్లాడారు. మృతికి గల కారణాల గురించి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. తమ కొడుకు మృతిపై అనుమానం ఉన్నట్లు మృతుడి తల్లిదండ్రులు తెలిపారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తమ కొడుకు చనిపోయాడని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని మంత్రిని వేడుకున్నారు. స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు.. కరీంనగర్ రూరల్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడారు. కేసు పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు వేగవంతం చేసి మృతిగల కారణాలు తెలుసుకోవాలని సూచించారు.

ఫైనాన్స్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: నూతన ఆర్థిక సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్, అకౌంట్ విభాగంలో జీఎం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసి నూతన ఆర్థిక సంవత్సరం 2024–25 గణాంకాలు ఏప్రిల్‌లో మొదలయి మార్చితో ముగుస్తాయన్నారు. ప్రతీ ఆర్థిక సంవత్సరం తొలిరోజు లక్ష్మీదేవి పూజ చేయడం ఆనావాయితీ అన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపొందించుకొని లాభాల బాటలో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మి, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ఏజీఎం(పర్సనల్) సీహెచ్ లక్ష్మీనారాయణ, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో..

నూతన ఆర్థిక సంవత్సరాన్ని పురస్కరించుకుని జీఎం కార్యాలయంలోని అకౌంట్, ఫైనాన్స్ విభాగంలో ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏరియా మరిన్ని లాభాలు గడించి ఉద్యోగులంతా సంతోషంగా ఉండాలని జీఎం ఆకాంక్షించారు.

ఆర్జీ–3లో 134శాతం ఉత్పత్తి

- ఇన్‌చార్జి జీఎం సుధాకర్‌రావు



సుధాకర్‌రావు

రామగిరి(మంథని): గత మార్చిలో ఆర్జీ–3లో 134 శాతం, ఏపీఏలో 109 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిచినట్లు ఆర్జీ–3, ఏపీఏ ఇన్‌చార్జి జీఎం సుధాకర్ రావు తెలిపారు. ఆర్జీ–3లో నిర్దేశిత 5.50 లక్షల టన్నులకు 7.36 లక్షల బొగ్గు ఉత్పత్తి చేశామన్నారు. అదేవిధంగా 99 శాతం మట్టి వెలికి తీశామన్నారు. 9.18 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని పేర్కొన్నారు. ఏపీఏ గనిలో నిర్దేశిత 1.39 లక్షల టన్నులకు 1.52 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడంతోపాటు 1.60 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆర్జీ–3 ఏరియాలో నిర్దేశిత 55 లక్షల టన్నులకు 107 శాతంతో 59.11 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామని అన్నారు. 85.65 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి సరికొత్త రికార్డు నమోదు చేశామని వివరించారు. ఏపీఏ ఏరియాలో నిర్దేశించిన 17.30 లక్షల టన్నులకు 85 శాతంతో 14.70 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని ఆయన వివరించారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో కృషి చేసిన అధికారులు కార్మిక సంఘం నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

మాదిగలకే పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇవ్వాలి

- మంత్రి శ్రీధర్‌బాబుకు ఊట్ల వరప్రసాద్ వినతి



వినతిపత్రం అందిస్తున్న ఊట్ల వరప్రసాద్

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థిని మార్చాలని, కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన మాదిగ సామాజిక వర్గం నుంచి ఎవరికైనా అవకాశం కల్పించాలని మంత్రి శ్రీధర్‌బాబుకు, ఎమ్మెల్యేలు విజయరమణరావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు జాతీయ భారత జాతీయ యువజన కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఊట్ల వర ప్రసాద్ సోమవారం వినతిపత్రం అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చు చేయలంటూ ఈనెల 5న జిల్లా కేంద్రంలో ×న్యాయ పోరాట దీక్ష। చేయనున్నట్లు తెలియజేశారు. అనంతరం దీక్ష అనుమతుల కోసం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలిసి దరఖాస్తు సమర్పించారు.